

5వ తేదీ వరకు భారీ వర్షాలు

చింతపల్లి, ఆగస్టు 31: అల్పపీడనం వల్ల జిల్లాలో సెప్టెంబరు 5వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయన్నారు. గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయన్నారు. వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా బయటకుపోయే మార్గాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.



హుకుంపేట మండలం తాడిపుట్టు పంచాయతీ ఉర్రాడ గ్రామంలో పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

తొలి రోజు 92 శాతం పింఛన్ల పంపిణీ

జిల్లాలోని 1,23,262 మంది లబ్ధిదారుల్లో 1,15,833 మందికి అందజేత

- కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, కూటమి నేతలు

పాడేరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొలి రోజైన శనివారం 92 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలో సగానికి పైగా పల్లెలకు రోడ్లు, సమాచార వ్యవస్థ సరిగా లేని పరిస్థితుల్లో సైతం శనివారం రాత్రి 8 గంటల సమయానికి జిల్లాలో 92 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా 1,25,262 మంది పెన్షన్ లబ్ధిదారులకు గాను తొలి రోజు రాత్రి 8 గంటలకు 1,15,833 మందికి పింఛన్లు అందించారు. మిగతా 9,429 మందికి పింఛన్లు అందించాల్సి ఉంది. ఆదివారం సెలవు కావడంతో శనివారం పెన్షన్ పొందని లబ్ధిదారులకు సోమవారం విధిగా అందిస్తామని అధికారులు తెలిపారు. వర్షాల్లో సైతం పెన్షన్ల పంపిణీలో ఉత్సాహంగా, బాధ్యతగా పాల్గొన్న అధికారులు, సిబ్బందిని కలెక్టర్ దినేశ్‌కుమార్ అభినందించారు. కాగా హుకుంపేట మండలం తాడిపుట్టు పంచాయతీ ఉర్రాడ గ్రామంలో లబ్ధిదారులకు కలెక్టర్ దినేశ్‌కుమార్ స్వయంగా పింఛన్లు పంపిణీ చేశారు. పాడేరులో ఐటీడీఏ పీవో వి.అభిషేక్, హుకుంపేట మండలం సంతారిలో టీడీపీ అరకులోయ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్, చింతపల్లి, కొయ్యూరు మండలాల్లో టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, అనంతగిరిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, మండలాల్లో స్థానిక కూటమి నేతలు పాల్గొని పెన్షన్ల పంపిణీని విజయవంతం చేశారు. రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ తమ ప్రాంతాల్లో పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు.

వదలని వాన

అల్పపీడన ప్రభావంతో కొనసాగుతున్న వర్షం



లంబసింగి ఘాట్ రోడ్డుపై విరిగిపడిన కొండ చరియలు



వరద నీటితో కళకళలాడుతున్న జోలాపుట్టు స్పిల్‌వే డ్యాం

పాడేరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): **బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లాలో గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం జిల్లా వ్యాప్తంగా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మరో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనలతో శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు. జి.మాడుగులలో అత్యధికంగా 64.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి.**

- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, గెడ్డలు
- జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- సంప్రతించాల్సిన ఫోన్ నంబర్లు: 08935 299912, 08935 293448

జిల్లా కేంద్రం పాడేరు మొదలుకుని అన్ని మండలాల్లోనూ వర్షం కురుస్తున్నది. గత మూడు రోజులుగా వర్షాలు కొనసాగుతుండడంతో జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. అలాగే జిల్లా అటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలకు సరిహద్దులో ఉండడంతో వాయుగుండం, అల్పపీడనాలు ఎక్కడ ఏర్పడినా జిల్లాలోని అధిక శాతం మండలాల్లో వాటి ప్రభావంతో వర్షాలు కురుస్తుంటాయి. కాగా శనివారం భిన్న వాతావరణం కనిపించింది. ఉదయం నుంచి వర్షం కొనసాగి మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో సుమారుగా ఒక గంట మాత్రం తీవ్రంగా ఎండకాసి ఆ తరువాత నుంచి ముసురు వాతావరణం నెలకొని భారీ వర్షం కురిసింది. తాజా వర్షానికి ముంచంగిపుట్టు, హుకుంపేట వారపు సంతలకు తీవ్ర అంతరాయం ఏర్పడగా ముంచంగిపుట్టు, పెదబయలు, జి.మాడుగుల, చింతపల్లి, డుంబ్రిగుడ ప్రాంతాల్లోని గెడ్డలు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గత మూడు రోజులతో పోలిస్తే శనివారం భారీ వర్షం కురిసింది. జిల్లాలో జి.మాడుగులలో అత్యధికంగా 64.2 మిల్లీమీటర్ల వర్షం కురవగా, అరకులోయలో అత్యల్పంగా 13.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రాత్రి వేళ లంబసింగి ఘాట్ రోడ్డు మూసివేత

చింతపల్లి: వర్షాల కారణంగా నర్సీపట్నం-చింతపల్లి ప్రధాన రహదారిలో లంబసింగి ఘాట్ రోడ్డును రాత్రి వేళ మూసివేస్తున్నట్టు స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అల్పపీడనం కారణంగా రాగల మూడు రోజులు అధిక వర్షసూచన ఉన్నందున లంబసింగి ఘాట్‌లో వృక్షాలు, బండ రాళ్లు పడే అవకాశముందన్నారు. దీంతో రాత్రి ఎనిమిది గంటల నుంచి మరుసటి రోజు ఉదయం ఏడు గంటల వరకు లంబసింగి ఘాట్ రోడ్డులో ప్రయాణం నిషేధించామన్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: మండలంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం ఆరు గంటల వరకు కుండపోత వర్షం కురిసింది. అనంతరం మధ్యాహ్నం వరకు తెరిపి ఇచ్చింది. సాయంత్రం నుంచి ఓ మోస్తరు వర్షం ... మిగతా 6వ పేజీలో

జిల్లాలో గత మూడు రోజులుగా నమోదైన వర్షపాతం (మిల్లీ మీటర్లలో)...

వ. సం. మండలం	గురువారం	శుక్రవారం	శనివారం
1. జి.మాడుగుల	20.4	46.8	64.2
2. అనంతగిరి	18.4	24.4	35.2
3. కూనవరం	1.1	18.9	56.4
4. ముంచంగిపుట్టు	39.2	16	18.1
5. చింతూరు	2.4	38.8	30.2
6. మారేడుమిల్లి	6.2	25.6	28.8
7. పెదబయలు	15.9	11.9	38.8
8. జీకేవీధి	6	5.2	48.2
9. వీఆర్.పురం	1.2	10.4	46.2
10. ఎటపాక	1.7	10.6	43.9
11. అరకులోయ	16.1	21.2	13.3
12. డుంబ్రిగుడ	12.6	14.6	19.2
13. పాడేరు	2.9	15.2	22.1
14. దేవీపట్నం	5.2	10.8	24.6
15. హుకుంపేట	13.8	10.2	15.8
16. రంపచోడవరం	3.8	16.4	19.4
17. చింతపల్లి	3.4	12.8	22.1
18. రాజవొమ్మంగి	2.9	5.1	20.6
19. కొయ్యూరు	3.8	7.4	20.4
20. అడ్డతీగల	1.7	4.8	22.4
21. వై.రామవరం	2.8	4.8	18.4
22. గంగవరం	2.8	4.2	15.8

అధికార యంత్రాంగం అప్రమత్తం

- కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశం

పాడేరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. తాజా వర్షాల నేపథ్యంలో జిల్లాలోని అధికారులతో శనివారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో వర్షాల పరిస్థితులపై పర్యవేక్షించేందుకు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని, ఎటువంటి సమాచారమైన ఫోన్ నంబర్లు: 08935 299912, 08935 293448 సంప్రతించవచ్చునన్నారు. అలాగే పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి 24 గంటలు పనిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు సెప్టెంబరు రెండో తేదీ వరకు కొనసాగుతాయనే వాతావరణ శాఖ సూచనలతో ప్రజల్ని మరింత అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు స్థానికంగా అందుబాటులో ఉంటూ అత్యవసర సేవలను అందించాలన్నారు. మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వరదలను ఎదుర్కొనేలా సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

మీ పిల్లలకు ఇలాంటి ఆహారమే పెడతారా?

కలుషిత ఆహార ఘటనపై కలెక్టర్ సీరియస్

- జాముగుడ ఆశ్రమ బాలికల పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్, టీచర్లపై మండిపాటు
- నిలకడగా విద్యార్థినుల ఆరోగ్యం
- విచారణ కమిటీ ఏర్పాటు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వెల్లడి



విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

అరకులోయ/డుంబ్రిగుడ, ఆగస్టు 31: డుంబ్రిగుడ మండలంలోని జాముగుడ ఆశ్రమ బాలికల పాఠశాలలో శుక్రవారం కలుషిత ఆహారం తిని విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంఘటనపై కలెక్టర్ దినేశ్‌కుమార్ సీరియస్ అయ్యారు. మీ పిల్లలకు ఇలాంటి ఆహారమే పెడతారా? అని పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్, టీచర్లపై మండిపడ్డారు. శనివారం ఉదయం ఆయన అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. మొత్తం 105 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురికాగా, శుక్రవారం రాత్రి 61 మంది అరకులోయ ఏరియా ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. శనివారం ఉదయం 12 మందిని, మధ్యాహ్నం 30 మందిని కూడా వైద్యం కోసం ఇక్కడికి తీసుకువచ్చారు. వారందరి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి ఆయన తెలుసుకున్నారు. విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉందని, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో పాటు అధిక శాతం మందికి జ్వరాలు ఉన్నాయని కలెక్టర్‌కు ఆస్పత్రి సూపరింటెండెంట్ రాము వివరించారు. విద్యార్థినులకు పూర్తిగా ఆరోగ్యం కుదుటపడిన తరువాత వసతి గృహానికి పంపుతామని కలెక్టర్ తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

పాఠశాలలోని 3వ తరగతి నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న బాలికలు మొదట భోజనం చేశారని, వారే అస్వస్థతకు గురయ్యారని కలెక్టర్ తెలిపారు. విద్యార్థినులు మధ్యాహ్నం బంగాళాదుంప, బఠాణి కూర, అన్నం తిన్నారని, రాత్రి అన్నం, సాంబారు, గుడ్డు కూరతో భోజనం చేశారని చెప్పారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్, విద్యార్థినులు చెబుతున్న దాన్ని బట్టి రాత్రి కూరలో పాడైపోయిన కోడిగుడ్లు కలపడం, మధ్యాహ్నం భోజనం సరిగ్గా లేకపోవడంతో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని కలెక్టర్ తెలిపారు. ఈ సంఘటనలో పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్, టీచర్ల నిర్లక్ష్యం ఉందన్నారు. ఈ పాఠశాలలో హెచ్‌ఎం, వార్డెన్, టీచర్ల మధ్య సమన్వయం లేదని గుర్తించామని, వీరందర్నీ సమూలంగా మార్చేస్తామన్నారు. ఫుడ్ శాంపిల్స్‌ను విశాఖపట్నంలోని ల్యాబ్‌కు పంపామని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ప్రతి రోజూ వసతి గృహాల్లో విద్యార్థులకు పెట్టే భోజనానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు తనకు, ఐటీడీఏ పీవోకు పంపే విధంగా ఆదేశిస్తున్నట్టు కలెక్టర్ చెప్పారు. ఇకపై తరచూ ... మిగతా 6వ పేజీలో

సమస్యల బడి

- జాముగుడ పాఠశాలలో కనీస వసతులు కరువు
- నాసిరకం తిండి తినలేక పారేస్తున్న విద్యార్థినులు
- మంచినీటి వసతి లేక ఇబ్బందులు



తాగునీరు, వాడుకకు వినియోగిస్తున్న మంచినీటి బోరు

డుంబ్రిగుడ, ఆగస్టు 31: మండలంలోని జాముగుడ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో కనీస వసతులు కొరవడ్డాయి. సురక్షితమైన తాగునీరు అందించడానికి ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు ఏడాది క్రితం మరమ్మతులకు గురైనా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. దీంతో తాగడానికి, వాడుకకు మంచినీటి బోరు నుంచి వచ్చే నీటినే విద్యార్థినులు తాగుతున్నారు. సరైన భోజనం పెట్టకపోవడంతో విద్యార్థినులు తినలేక పారబోస్తున్నారు. అలాగే విద్యార్థినులకు సరిపడా మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అసౌకర్యాల వల్ల అనారోగ్యానికి గురవుతున్నామని, హెచ్‌ఎం, వార్డెన్ పట్టించుకోవడం లేదని విద్యార్థినులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలలో కనీస సదుపాయాలు కల్పించాలని వారు కోరుతున్నారు.



నాసిరకం భోజనం తినలేక పారేసిన దృశ్యం

ప్రతి మండలానికి ప్రత్యేకాధికారి

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

- ఇకపై మండల స్థాయిలో కార్యకలాపాలన్నీ వారి పర్యవేక్షణలోనే..
- పాడేరు మండలానికి డీఆర్‌డీఏ పీడీ వి.మురళి



పాడేరు మండల ప్రత్యేకాధికారి వి.మురళి

(పాడేరు-ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణ, సమర్థవంతమైన సేవలను ప్రజలకు అందించేందుకు జిల్లాలోని ప్రతి మండలానికి ప్రత్యేక అధికారిని నియమిస్తూ కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇకపై మండల స్థాయిలో అన్ని ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలను పక్కాగా అమలు చేసే బాధ్యత మండల ప్రత్యేకాధికారిపై ఉంటుంది. ఇప్పటికే రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించిన ప్రభుత్వం, జిల్లాల్లోని ప్రతి మండలానికి ప్రత్యేకాధికారిని నియమించాలని సూచించింది. ఇందులో భాగంగా కలెక్టర్ ఈ ఉత్తర్వులను జారీ చేశారు.

జిల్లాలోని 22 మండలాలకు ప్రత్యేకాధికారులను నియమించారు. జిల్లా కేంద్రం పాడేరుకు డీఆర్‌డీఏ పీడీ వి.మురళిని ప్రత్యేకాధికారిగా నియమించగా, అరకులోయకు జిల్లా ఉద్యానవనాధికారి రమేశ్‌కుమార్‌రావు, చింతపల్లికి గ్రామీణా నీటి సరఫరా విభాగం ఈఈ(ప్రస్తుతం ఈ పోస్టు ఖాళీ), ముంచంగిపుట్టుకు గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ ఐ.కొండలరావు, పెదబయలుకు ఆహార భద్రతా తనిఖీ అధికారి పి.వేణుగోపాలరావు, డుంబ్రిగుడలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, హుకుంపేటకు జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, అనంతగిరికి టీడబ్ల్యూ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీపీఎస్ శర్మ, జీకేవీధికి ఆర్ అండ్ బీ ఈఈ బాల సుందరబాబు, కొయ్యూరుకు హౌసింగ్ పీడీ శ్రీనివాస్‌ను నియమించారు. అలాగే ... మిగతా 6వ పేజీలో

15 మంది సీఐల బదిలీ

- విశాఖ రేంజ్ డీఐజీ ఉత్తర్వులు

- వార్త 5వ పేజీలో..

రహదారి ఛిద్రం.. ప్రయాణం ప్రమాదకరం



జీకేవీధి- లంకపాకల మధ్య చెరువును తలపిస్తున్న ప్రధాన రహదారి

- వర్షాలకు గోతులమయంగా మారిన సీలేరు-జీకే వీధి అంతర్రాష్ట్ర రహదారి
- వాహనచోదకులకు తప్పని ఇబ్బందులు

సీలేరు, ఆగస్టు 31 : **అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు జీకేవీధి, సీలేరు మధ్యలో గల అంతర్రాష్ట్ర రహదారి గోతులమయమైంది. ఈ రోడ్డు పరిస్థితి చూస్తే ఇది అంతర్రాష్ట్ర రహదారా?, లేక మారుమూల గిరిజన గ్రామాలకు వెళ్లే రోడ్డా? అనే అనుమానం కలుగుతుంది. తెలంగాణ, ఒడిశా నుంచి ఈ మార్గంలో ప్రయాణించే వాహన చోదకులు కూడా ఇబ్బందులు పడుతున్నారు.**

జీకేవీధి మండలం ఆర్‌వీనగర్ నుంచి సీలేరు వరకు 51 కిలోమీటర్ల సింగిల్ లైన్ రహదారి ఉంది. జీకేవీధి నుంచి సీలేరు వరకు పూర్తిగా ప్రమాదకరమైన ఘాట్ రోడ్డు. సీలేరు జలవిద్యుత్ కేంద్రం నిర్మాణ సమయంలో 1964లో జల విద్యుత్ కేంద్రం సామగ్రిని నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి తరలించడానికి అప్పట్లో సింగిల్ లైన్ రహదారిని నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ రహదారి విస్తరణకు నోచుకోలేదు. 2017-18 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ రహదారిని రెండు లైన్లుగా విస్తరించడానికి రూ.84 కోట్లు మంజూరు చేసినప్పటికీ అటవీ శాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో అది కార్యరూపం దాల్చలేదు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ నిధులను వేరే వాటికి మళ్లించి ఈ రహదారిని పట్టించుకోలేదు. దీంతో రహదారి ఆర్‌వీనగర్ నుంచి నూతిబంద వరకు గల 12 కిలోమీటర్ల పాటు ... మిగతా 6వ పేజీలో



వర్షాల ధాటికి ధారాలమ్మ ఘాట్‌లో రాళ్లు తేలిన అంతర్రాష్ట్ర రహదారి

ముసురు.. ముంపు



చెరువును తలపిస్తున్న అనకాపల్లి పీటీడీ కాంప్లెక్స్ ఆవరణ

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు అనకాపల్లి జిల్లాలో పలు రోడ్లు, ఆర్టీసీ కాంప్లెక్సులు చెరువులను తలపిస్తున్నాయి. పలు చెరువుల పొర్లుకట్లు పారుతున్నాయి. పలుచోట్ల వరి పొలాల్లో నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట పొలాల్లో నీరు చేరింది. వాయుగుండం ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది.



పరవాడ పెద్ద చెరువు పొర్లుకట్ట పైనుంచి ఉధృతంగా పారుతున్న నీరు



నర్సీపట్నం 22వ వార్డులో రోడ్డుపై మోకాళ్ల లోతు మేర పారుతున్న నీరు



రాంబిల్లి మండలం అప్పన్నపాలెం కాలనీ జంక్షన్ వద్ద కాలువను తలపిస్తున్న నేవీ రోడ్డు



కోటవురట్ల ఎంపీడీవో ఆఫీసు ఎదురుగా మెయిన్‌రోడ్డుపై నిలిచిపోయిన వర్షపు నీరు

గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా

▸ నేర సమీక్షలో ఎస్పీ దీపిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

అనకాపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాను అదుపు చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలద్వారా నిఘాను కొనసాగించాలని ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. శనివారం సాయంత్రం ఎస్పీ కార్యాల యంలో జరిగిన నెలవారీ నేరాల సమీక్షలో ఆమె మాట్లాడారు. పోలీసు స్టేషన్‌ల పరిధిలో దర్యాప్తులో ఉన్న సాధారణ, తీవ్రమైన, ఇతరత్రా ప్రాపర్టీ రికవరీ కేసుల విచారణ వేగవంతం కావాలన్నారు. 174 సీఆర్‌పీసీ కేసులు, గంజాయి కేసులతోపాటు మిస్సింగ్ కేసులకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సమీక్ష జరిపారు. కేసుల విచారణ విషయంలో సంబంధిత ఇన్‌స్పెక్టర్లకు పలు సూచనలు చేశారు. గంజాయి రవాణా కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితులను అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఇతరత్రా కేసులపై ఎస్పీ ఆరా తీశారు. ఈ సమావేశంలో ఏఎస్పీ (అడ్మిన్) దేవప్రసాద్, ఎస్‌బీ డీఎస్పీ అప్పారావు, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, నర్సీపట్నం డీఎస్పీ జీఆర్‌ఆర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపై విరిగి పడిన కొండ చరియలు



ఇంటిపై పడిన కొండ చరియలు

కోటవురట్ల, ఆగస్టు 31: గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పందూరులో కొండ చరియలు విరిగిపడి ఒక ఇళ్లు పాక్షికంగా దెబ్బతింది. గ్రామానికి చెందిన మామిడి లక్ష్మి ఊరకొండపై రైతు భరోసా కేంద్రం పక్కనే శ్లాబ్ ఇళ్లు నిర్మించుకుంది. ఈ నేపథ్యంలో తాజా వర్షాలకు ఊర కొండ పైనుంచి శనివారం సాయంత్రం కొండచరియలు విరిగి పడి మామిడి లక్ష్మి ఇంటిని ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికి ప్రాణపాయం జరగలేదు. ఇంటి గోడ పాక్షికంగా దెబ్బతింది.

ఇద్దరికీ హెల్మెట్ తప్పనిసరి

▸ నేటి నుంచి కొత్త నిబంధన అమలు

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఇకపై ద్విచక్ర వాహన చోదకుడితోపాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాల్సిందే. లేనిపక్షంలో పోలీసులు కేసు నమోదుచేస్తారు. వాహనం నడుపుతున్న వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్‌ను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలకు రవాణా శాఖ అధికారులకు పంపించేస్తారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాలను తగ్గించేందుకు ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితోపాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనే సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఆదివారం నుంచి నగరంలో అమలు చేస్తున్నట్టు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సెప్టెంబరు ఒకటి నుంచి ద్విచక్ర వాహనంపై ఇద్దరు ప్రయాణిస్తే ఇద్దరూ విధిగా ఐఎస్‌ఐ గుర్తింపు కలిగిన హెల్మెట్‌ను ధరించాల్సి ఉంటుందన్నారు. హెల్మెట్ పెట్టుకోని పక్షంలో రూ.135 ఈ-చలాన్ జారీచేయడంతోపాటు వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్‌ను స్వాధీనం చేసుకుని రవాణా శాఖ అధికారులకు పంపిస్తామన్నారు.

ఎసెన్షియా మృతుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ



మూలజంపలో సన్యాసినాయుడు కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

అచ్యుతాపురం/రాంబిల్లి/ ఎస్.రాయవరం, ఆగస్టు 31: అచ్యుతాపురం సెజ్‌లో గల ఎసెన్షియా కర్మాగారం ప్రమాదంలో మృతుల కుటుంబ సభ్యులకు శనివారం వైసీపీ నేతలు పరిహారం చెక్కులను అందజేశారు. అచ్యుతాపురం మండలం మోటూరు పాలెంకి చెందిన మృతుడు పూడి మోహన్, వాశెట్టిపాలెం గ్రామస్థులు చిన్నారావు, రాంబిల్లి మండలం మూలజంపకు చెందిన సన్యాసినాయుడు, ఎస్.రాయవరం మండలంలోని దార్లపూడికి చెందిన జవ్వాది చిరంజీవి, బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన పూసర్ల వెంకటసాయి కుటుంబ సభ్యులకు ఐదు లక్షల చొప్పున చెక్కులను ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కన్నబాబు రాజు, కరణం ధర్మశ్రీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఎస్.రాయవరం జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, ఎలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	91.00
లైవ్ ధర	111.00
విత్ స్కిన్	192.00
స్కిన్ లెస్	202.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చీడిగుమ్మల కార్యదర్శిని సస్పెండ్ చేయాలి

▸ జిల్లా కలెక్టర్‌కు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశం

▸ శతశాతం పింఛన్ల పంపిణీ చేయకుంటే చర్యలు



చీడిగుమ్మలలో పింఛన్ పంపిణీ చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

గొలుగొండ ఆగస్టు 31: శతశాతం పింఛన్ల పంపిణీ సాయంత్రం లోగా జరగాలని.. లేదంటే సంబంధిత అధికారులపై చర్యలు చేపడతామని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం మండలంలోని చీడిగుమ్మలలో లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీ వద్ద గ్రామ కార్యదర్శి ఆర్‌వీ.సత్యనారాయణ అందుబాటులో లేకపోవడంపై స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి అతడిని సస్పెండ్ చేయాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ ఈ విషయమై విచారణ చేయాలని ఆర్డీవో జయరాం, ఎంపీడీవో డేవిడ్‌రాజులను ఆదేశించారు.

అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. ప్రతి నెలా ఒకటో తేదీ సాయంత్రంలోగా నూరుశాతం పంపిణీ చేసే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. పింఛన్ల కోసం సెప్టెంబరు 20వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. చీడిగుమ్మల పీహెచ్‌సీ ఇరుకు గదుల్లో నిర్వహణపై టీడీపీ నేతలు స్పీకర్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన గ్రామ సచివాలయ భవనంలో పీహెచ్‌సీని నిర్వహించాలని ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ జె.ప్రశాంతిని ఆదేశించారు. గ్రామంలో దళితుల శ్మశానం అభివృద్ధికి రూ.పది లక్షలు, దూళిపేటలో రోడ్డు నిర్మాణానికి రూ.13 లక్షలు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ధనుంజయ్, టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, నేతలు భీమిరెడ్డి సత్యనారాయణ, కామిరెడ్డి గోవింద్, కొల్లి సత్తిబాబు పాల్గొన్నారు.

బోగస్ పింఛన్లపై త్వరలోనే నిర్ణయం

▸ వైసీపీ హయాంలో అడ్డగోలుగా అనర్హులకు పింఛన్లు

▸ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్



వెంకన్నపాలెంలో వృద్ధురాలికి పింఛను అందిస్తున్న ఎంపీ రమేశ్, పక్కన ఎమ్మెల్యే రాజు

చోడవరం, ఆగస్టు 31: వైసీపీ పాలనలో అడ్డగోలుగా అనర్హులకు మంజూరు చేసిన పింఛన్లపై ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తెలిపారు. శనివారం మండలంలోని వెంకన్నపాలెంలో లబ్ధిదారులకు ఆయన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనర్హులకు, వైకల్యం లేని వారికి పింఛన్లు మంజూరు చేశారన్నారు. దీనిపై సర్వే చేసి బోగస్‌లను ఎలా తొలగించాలనేదానిపై కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకొంటుందన్నారు. వైసీపీ హయాంలో అనర్హులైన వికలాంగులకు నాటి ప్రభుత్వం తీసుకుని వచ్చిన వత్తిడి మేరకు డాక్టర్లు అడ్డగోలుగా సర్టిఫికెట్లు మంజూరు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయం సిబ్బంది సహకారంతో నిరాటంకంగా లబ్ధిదారులకు పింఛన్లు అందించగలుగుతున్నామన్నారు. అంతకు ముందు వెంకన్నపాలెం జంక్షన్‌లో సీఎం రమేశ్, ఎమ్మెల్యే రాజు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు, టీడీపీ మండల అధ్యక్షులు బొడ్డేడ గంగాధర్, వెంకన్నపాలెం సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు, తెలుగుయువత నాయకులు దేవర రవికుమార్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఒక రోజు ముందుగానే పింఛన్ల పండగ

▸ హోం మంత్రి వంగలపూడి అనిత

పాయకరావుపేట, ఆగస్టు 31: రాష్ట్రంలో ఒకరోజు ముందుగానే పింఛన్ల పండగ వచ్చిందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శనివారం పట్టణంలోని బృందావనం కాలనీలో పలువురు పింఛనుదారుల ఇళ్లకు ఆమె వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం వచ్చినందున అధికారులెవరూ ఇబ్బంది పడకూడదన్న ఆలోచనతోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పింఛన్లను ఒకరోజు ముందుగానే అందజేస్తున్నారన్నారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర హోం, విపత్తుల నివారణ శాఖా మంత్రి వంగలపూడి అనిత అన్నారు.

వాయుగుండం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైందని, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారని, లోతట్టు ప్రాంతాల్లో ఉండే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నామని ఆమె తెలిపారు. ఆమె వెంట ఎంపీడీఓ సాంబశివరావు, తహసీల్దారు జయప్రకాష్, టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, బీజేపీ నాయకుడు వేముల వెంకటేశ్వరరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కంప్యూటర్ ల్యాబ్‌ని పరిశీలిస్తున్న అయ్యన్నపాత్రుడు

సీఎస్‌ఆర్ నిధులతో డిగ్రీ కళాశాల అభివృద్ధి : అయ్యన్న

నర్సీపట్నం, ఆగస్టు 31 : సీఎస్‌ఆర్ నిధులతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కంప్యూటర్లు, సెమినార్ హాల్ పోడియం, సౌండ్ సిస్టం, కుర్చీలు, సైకిల్ షెడ్ మరమ్మతులు, జిమ్ నిర్మాణానికి కృషి చేస్తానని స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు హామీ ఇచ్చారు. శనివారం ఆయన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్. రాజు ఆయనతో మొక్క నాటించారు. అక్కడ కంప్యూటర్ ల్యాబ్‌ని పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

15 మంది సీఐల బదిలీ

▸ విశాఖ రేంజ్ డీఐజీ ఉత్తర్వులు

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రేంజ్ పరిధిలో 15 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ డీఐజీ గోపినాథ్ జట్టి శనివారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు.

వరుస నంబర్/పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న చోటు	బదిలీ అయిన స్థానం
1. పి.పైడపునాయుడు	రేంజ్ వీఆర్	కె.కోటపాడు
2. నమ్మి గణేష్	అనకాపల్లి పీసీఆర్	అచ్యుతాపురం యూపీఎస్
3. ఎం.బుచ్చిరాజు	అచ్యుతాపురం యూపీఎస్	రేంజ్ వీఆర్
4. బి.చిన్నస్వామినాయుడు	కె.కోటపాడు	శ్రీకాకుళం మహిళా పోలీస్ స్టేషన్
5. ఎం.వినోద్‌బాబు	రేంజ్ వీఆర్	అనకాపల్లి సోషల్ మీడియా సైబర్‌సెల్
6. ఎల్.రేవతమ్మ	సిటీ నుంచి రేంజ్ వీఆర్	నర్సీపట్నం రూరల్
7. డి.దీనబంధు	రేంజ్ వీఆర్	పాడేరు యూపీఎస్
8. డి.నవీన్‌కుమార్	పాడేరు యూపీఎస్	ఏఎస్‌ఆర్ జిల్లా సీసీఎస్
9. వెలగాడ శంకరనారాయణ	ఏఎస్‌ఆర్ జిల్లా సీసీఎస్	రేంజ్ వీఆర్
10. ఎస్.బాలసూర్యారావు	పరవాడ యూపీఎస్	అనకాపల్లి డీఎస్‌బీ-1
11. ఆర్.మల్లికార్జునరావు	రేంజ్ వీఆర్	పరవాడ యూపీఎస్
12. వి.చక్రధరరావు	సిటీ నుంచి రేంజ్ వీఆర్	విజయనగరం డీసీఆర్‌బీ
13. బెండి వెంకటరావు	రేంజ్ వీఆర్	విజయనగరం టాస్క్‌ఫోర్స్
14. జి.అప్పన్న	నక్కపల్లి	పాయకరావుపేట యూపీఎస్
15. జి.అశోక్‌కుమార్	రేంజ్ వీఆర్	అనకాపల్లి రూరల్

దూరవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పెంపు

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఏయూ దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే పలు డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన గడువును పొడిగించారు. వాస్తవానికి శనివారంతో ఫీజులు చెల్లించేందుకు గడువు ముగిసింది. సర్వర్ కూడా సరిగ్గా పని చేయకపోవడంతో వందలాది మంది విద్యార్థులు ఆయా కోర్సుల్లో చేరలేక పోయారు.

ఈ విషయాలు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతోపాటు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ్‌మోహన్ గడువు తేదీని పొడిగిస్తునట్టు తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి అకడమిక్ ఇయర్ కోర్సుల్లో చేరే విద్యార్థులు ఎటువంటి అపరాధ రుసుం చెల్లించకుండా నవంబరు 15 వరకు ఫీజులు చెల్లించేందుకు అవకాశం కల్పించినట్టు తెలిపారు.

పింఛన్ల పంపిణీని పరిశీలించిన కలెక్టర్

▸ జిల్లాలో సబ్బవరం మొదటి స్థానం



బాటజంగాలపాలెంలో పింఛన్లు అందజేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

సబ్బవరం, ఆగస్టు 31: మండలంలో శనివారం జరిగిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పరిశీలించారు. ఈ సందర్భంగా బాటజంగాపాలెంలో కొంతమంది పింఛనుదారులకు ఆమె సొమ్మును అందజేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమేశ్‌నాయుడు మాట్లాడుతూ.. మండలంలో మొత్తం పింఛన్లు 8,206 ఉండగా 7,915 మందికి పంపిణీ చేసి 96.45 శాతంతో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచినట్టు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పడాల వెంకటరమణ, ఈవోపీఆర్‌డీ మహేశ్, వెలుగు ఏపీఎం సాయిరమేశ్, సిబ్బంది విజయ పాల్గొన్నారు.

పాడేరులో పండగలా పింఛన్ల పంపిణీ

మొదటి రోజు 93.08 శాతం పూర్తి.. ఆనందోత్సాహంలో లబ్ధిదారులు

పాడేరు రూరల్, ఆగస్టు 31: పాడేరులో పింఛన్ల పంపిణీ కార్యక్రమం పండగలా జరిగింది. వాస్తవంగా ప్రతీ నెల ఒకటో తేదీ లేదా ఆ తర్వాత నుంచి ఈ ప్రక్రియ ప్రారంభవుతుండగా, ఈ నెల ఒక రోజు ముందుగానే పింఛన్ మొత్తం చేతికందడంతో లబ్ధిదారుల్లో ఆనందోత్సాహాలు కనిపించాయి. సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం కావడంతో, ముదుంగానే పంపిణీ ప్రక్రియను చేపట్టారు. పాడేరు మండలంలో మొదటి రోజు 93.08 శాతం పంపిణీ పూర్తయినట్టు ఎంపీడీవో కె.సాయి నవీన్ తెలిపారు. మండలం కేంద్రం పాడేరు నీలకంఠానగర్‌లో ఐటీడీఏ పీవో వి.అభిషేక్ స్వయంగా పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

అలాగే మండలంలోని 16 సచివాలయాల పరిధిలో ఉన్న 6,571 మంది లబ్ధిదారులకుగాను మొదటి రోజు 6,116 మందికి ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. పాడేరు-1 సచివాలయ పరిధిలో 380 మంది లబ్ధిదారులకుగాను 338 మందికి, సచివాలయ-2 పరిధిలో 299 మందికి 284, పాడేరు సచివాలయం-3 పరిధిలో 218 మందికి 206, దేవాపురంలో 332 మందికి 330, ఇరడాపల్లి 536 మందికి 523, ఐనాడ 280కి 273, తుంపాడ 457కి 438, సలుగు 467కి 446, చింతవీధి 322కి 304, లగిశపల్లి 535కి 501, వట్లమామిడి 478కి 468, గుత్తులపుట్టు 458కి 423, గొండెలి 493కి 444, వంతాడపల్లి 312కి 270, మినుములూరు 555కి 490, డోకులూరు సచివాలయ పరిధిలో 449 మంది లబ్ధిదారులకు 378 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. మొదటి రోజు అందుబాటులో లేని 455 మంది లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేస్తామని చెప్పారు.



పాడేరు నీలకంఠానగర్‌లో ఫించన్‌లు పంపిణీ చేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

ముంచంగిపుట్టులో 86 శాతం...

ముంచంగిపుట్టు: మండలంలో శనివారం 86 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయడం జరిగిందని ఎంపీడీవో కిరణ్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని 23 పంచాయతీల్లో వివిధ రకాల 6250 మంది పింఛన్‌దారులు ఉండగా, మొదటి రోజు మొత్తం 5387 మందికి పింఛన్ల సొమ్మును అందించడం జరిగిందని చెప్పారు. మిగిలిన వారికి ఆదివారం పింఛన్ల సొమ్మును పంపిణీ చేస్తామని ఆయన చెప్పారు. జోరువానను సైతం లెక్క చేయకుండా పింఛన్ల పంపిణీకి మారుమూల గ్రామాలకు వెళ్లిన ఉద్యోగులను ఎంపీడీవో అభినందించారు.

అనంతగిరిలో 93.47 శాతం పంపిణీ

అనంతగిరి: మండలంలోని వృద్ధాప్య, వితంతువు, దివ్యాంగులు, తదితర పింఛన్లను 93.47 శాతం పంపిణీ చేసినట్టు ఎంపీడీవో నగేష్ తెలిపారు. ఆదివారం ఒక్క రోజు ముందుగానే పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సచివాలయ ఉద్యోగుల సహకారంతో పింఛన్ల పంపిణీ విజయవంతమైందన్నారు.

పెదబయలులో 85 శాతం..

పెదబయలు: మండలంలో 85 శాతం పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందని ఎంపీడీవో విగ్గిన్స్ తెలిపారు. అకాల వర్షాల కారణంగా కొన్ని పంచాయతీల్లో గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తుండడంతో తగిన జాగ్రత్తలు పాటిస్తూ లబ్ధిదారులకు పింఛన్లు అందించామన్నారు. భారీ వర్షాలను సైతం లెక్క చేయకుండా పింఛన్‌లను పంపిణీ చేసిన సచివాలయ ఉద్యోగులకు అభినందించారు.



హుకుంపేట మండలం సంతరిలో పింఛన్ పంపిణీ చేస్తున్న శ్రావణ్‌కుమార్

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాలు

టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్

హుకుంపేట, ఆగస్టు 31: కూటమి ప్రభుత్వంతోనే ప్రజలకు సంక్షేమ పథకాలు సాధ్యమని టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. మండలంలోని సంతరి పంచాయతీలో కూటమి నాయకులతో కలిసి పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం పింఛన్ మొత్తం పెంపు హామీని విస్మరించిందన్నారు. గత అలాగే అర్హులకు కూడా పలు కారణాలు చూపుతూ పింఛన్లను నిలిపివేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటి నెల నుంచి వితంతువులు, వృద్ధులు తదితరులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలకు పెంచి సచివాలయ ఉద్యోగుల ద్వారా అందిస్తున్నట్టు గుర్తు చేశారు. ఈ మొత్తాన్ని అవ్వాతాతలు సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తులసీరావు, జీసీసీ మాజీ చైర్మన్ లక్ష్మణుడు, నాయకులు సాగిరి సుబ్బారావు, లక్ష్మయ్య, బాకూరు రమణ, సుమన్, సత్యనారయణ, సత్యవతి, సూర్యకాంతం, కె.రమ, శంకర్, రామలింగం, నూకరాజు, చిట్టిబాబు, శ్రీను పాల్గొన్నారు

అవ్వాతాతలకు కూటమి ప్రభుత్వం అండ

- ఒక రోజు ముందే పింఛన్ పంపిణీ
- టీడీపీ పాడేరు నియోజకవర్గం ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



చింతపల్లిలో వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న గిడ్డి ఈశ్వరి

చింతపల్లి/కొయ్యూరు, ఆగస్టు 31: అవ్వాతాతలకు కూటమి ప్రభుత్వం అండగా పనిచేస్తున్నదని టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. చింతపల్లి, కొయ్యూరు మండలాల్లో శనివారం గ్రామ సచివాలయం ఉద్యోగులతో కలిసి లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పింఛన్‌దారులకు ఎన్టీఆర్ భరోసా పంపిణీలో అంతరాయం కలగకుండా ఉండేందుకు సెప్టెంబరు పింఛన్ ఒక రోజు ముందుగానే పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చి హామిని అధికారంలోకి వచ్చిన వెంటనే నెరవేర్చిందన్నారు. ఒకేసారి రూ.వెయ్యి పింఛన్ పెంచడం జరిగిందన్నారు. గత ఐదేళ్లగా వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందన్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. ఆదివాసీ గ్రామాలకు సదుపాయాలు కల్పించడంలో విఫలమైందన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు వచ్చిన ప్రతీ హామీని నెరవేర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఈ ఏడాది రాజ్‌మా విత్తనాలు నెల రోజులు ముందుగా 90 శాతం రాయితీపై రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు తోట దొరబాబు, బోనంగి సత్యవతి, గరెంగి రాజేశ్వరి, పుష్పలత, ఏలూరి రత్నం, దొండ ప్రసాద్, వారా కొండలరావు, రీములు జగన్, కిల్లో పూర్ణచంద్రరావు, రమణ, లక్ష్మణ్, అబ్బాయిదొర, రీమల ఆనందరావు, కేశ్వరరావు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్లతో ముందే పండగ

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు



కొత్తూరులో పింఛన్ సొమ్ము అందిస్తున్న నాగరాజు, విజయరాణి తదితరులు

అనంతగిరి, ఆగస్టు 31: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పింఛన్‌దారులకు భరోసా కలిగిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు అన్నారు. మండలంలోని కొత్తూరు పంచాయతీ కేంద్రంలోని శనివారం సామాజిక పింఛన్ల కార్యక్రమంలోని రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి బొర్రా విజయరాణితో కలిసి బొర్రా నాగరాజు పింఛన్లను పంపిణీ చేశారు. ఆదివారం సెలవు కావడంతో 31వ తేదీనే పింఛన్ల పంపిణీకి సీఎం నారా చంద్రబాబు ప్రత్యేక చొరవచూపారని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అరకు పార్లమెంట్ మహిళా అధికార ప్రతినిధి ఎ.సుబ్బలక్ష్మి, వైస్ సర్పంచ్ గాలి నరసింహరావు, మహిళ పోలీస్ పి.లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మండలానికి ప్రత్యేకాధికారి

... 3వ పేజీ తరువాయి

రంపచోడవరం మండలానికి పశు సంవర్ధకశాఖ డీడీ అహ్మద్ షరీఫ్, దేవీపట్నానికి గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ డేవిడ్‌రాజు, వై.రామవరానికి ఐటీడీఏ ఉద్యానవనాధికారి చిట్టిబాబు, రాజవొమ్మంగికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్‌బాబు, అడ్డతీగలకు గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ డీఈఈ నాగరాజు, మారేడుమిల్లికి గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ డీఈఈ చైతన్య, గంగవరానికి డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవేంద్రలను నియమించారు. వీఆర్.పురం మండలానికి పంచాయతీరాజ్ శాఖ ఏఈఈ రామకృష్ణారెడ్డి, చింతూరుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేడ్కర్, కూనవరానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.లక్ష్మిపతి, ఎటపాకకు గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ జి.మురళిని నియమించారు. వారికి కేటాయించిన మండలాల్లోని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షించడం, పటిష్ఠంగా అమలు చేయడం వారి బాధ్యత అని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఖనిజ సంపద దోపిడీకే పెద్ద రహదారులు

- గిరిజనుల అభివృద్ధిని విస్మరించిన వైసీపీ ప్రభుత్వం
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారయణమూర్తి

చింతపల్లి, ఆగస్టు 31: గిరిజన ప్రాంతంలో నిక్షిప్తమైన ఖనిజ సంపద దోచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం పెద్ద రోడ్లు నిర్మిస్తున్నదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి ఆరోపించారు. స్థానిక వర్తక సంఘం భవనంలో శనివారం సీపీఐ జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆదివాసీలు అడగకపోయిన రాజమహేంద్రవరం నుంచి గిరిజన గ్రామాలను కలుపుతూ విజయనగరం వరకు జాతీయ రహదారి నిర్మాణం శరవేగంగా పూర్తి చేస్తున్నారన్నారు. గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించాలని ఆదివాసీలు ప్రాధేయ పడినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. వైసీపీ ప్రభుత్వం ఆదివాసీ గ్రామాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. ఇప్పటికీ ఆదివాసీలు, రోగులు, గర్భిణులను ఆస్పత్రులకు డోలీపై మోసుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వామపక్షాలు, ఆదివాసీ సంఘాల నాయకులు ఉద్యమాల ఫలితంగా బాక్సైట్ తవ్వకాలు ఆగాయన్నారు. మైదాన ప్రాంతంలో బాక్సైట్ పరిశ్రమ నిర్మాణం జరిగిపోయిందని, ఈ నేపథ్యంలో ఎప్పుడైనా గిరిజన ప్రాంతంలోనున్న బాక్సైట్ గనులను తవ్వే ప్రమాదం లేకపోలేదన్నారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం పింఛన్ నగదు పెంచి, సెప్టెంబరు నెల పింఛన్ ఒక రోజు ముందే పంపిణీ చేస్తుందని, దీన్ని తాము హర్షిస్తామని చెప్పారు. అయితే గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా గిరిజన గ్రామాలకు రహదారులు, ఇతర సదుపాయాలు కల్పించేందుకు ఎన్డీయే ప్రభుత్వం కృషి చేయాలన్నారు. గిరిజన ప్రాంతంలో టూరిజం పేరిట ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను నాశనం చేస్తున్నారన్నారు. టూరిజం వల్ల ఆదివాసీ గ్రామాలు కాలుష్య కోరల్లో చిక్కుకోవడం మినహా గిరిజనులకు ఒరిగేది ఏమీ లేదన్నారు. నేడు దేశ వ్యాప్తంగా ప్రకృతి, సేంద్రియ వ్యవసాయం అంటూ ప్రభుత్వాలు ఆర్భాటంగా ప్రచారం చేస్తున్నాయన్నారు. ఎన్నో ఏళ్లగా ఆదివాసీలు సేంద్రియ పద్ధతిలో పంటలను సాగు చేస్తున్నారన్నారు. పెరుగుతున్న ధరలపై ప్రజలను చైతన్యం చేస్తూ ఆందోళన చేపట్టేందుకు సెప్టెంబరు ఒకటి నుంచి ఐదోతేదీ వరకు సీపీఐ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. గిరిజన ప్రాంతంలో సీపీఐకి పూర్వ వైభం తీసుకొచ్చేందుకు కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షుదురాలు అత్తిలి విమల, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ, మండల అధ్యక్షుడు పేట్ల పోతురాజు, ఎంపీటీసీ సభ్యుడు సెగ్గె సత్తిబాబు, సర్పంచ్ పేట్ల రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

బొర్రా గుహలకు నష్టం లేకుండా ట్రాక్ ఏర్పాటుచేయాలి

- అరకు ఎంపీ తనూజరాణి

అనంతగిరి, ఆగస్టు 31: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు నష్టం లేకుండా సర్వేలు చేసి ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని అరకు ఎంపీ తనూజరాణి రైల్వే అధికారులకు సూచించారు. బొర్రా గుహలకు ముప్పుపై స్థానికుల వినతి మేరకు ఎంపీ తనూజరాణి ఇటీవలే కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినివైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై కేంద్రమంత్రి ఆదేశాలు మేరకు ఎంపీ తనూజరాణి, మాజీ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ రైల్వే శాఖ అధికారులతో కలిసి శనివారం బొర్రాను సందర్శించారు. ముందుగా స్థానికులతో చర్చించగా, డబ్లింగ్ పనుల్లో భాగంగా గుహల పైనుంచి ట్రాక్ ఏర్పాటుచేస్తే గుహలు కూలిపోయే ప్రమాదం సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీ సభ్యురాలు అరుణ, పెసా అధ్యక్షుడు దానియే తదితరులు తెలిపారు. గుహలకు నష్టపోకుండా ట్రాక్ ఏర్పాటు చేయాలని, సర్వేలు నిర్వహించిన తరువాతనే ట్రాక్ ఏర్పాటుకు రైల్వేశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. గుహలకు 50 మీటర్ల దూరంలోని ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. రిజర్వు ఫారెస్ట్ భూములను ఇచ్చేందుకు గిరిజనులు అంగీకరిస్తున్నట్టుగా అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలోని రైల్వే శాఖ చీఫ్ అడ్మిస్ట్రేషన్ అధికారి ఏజీ.శ్రీనివాసరావు, చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరావు, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ రాజీవ్‌కుమార్, ఏయూ జియోలజీ శంకరాం, అసిస్టెంట్ జియోలజీ ప్రొఫెసర్ కరుణాకర్, మోటర్ యూనియన్ అధ్యక్షుడు శ్యామ్, పర్యాటకశాఖ సిబ్బం ది రాజు, సోమేష్, రాము తదితరులు పాల్గొన్నారు.



రెండో రైల్వేట్రాక్ పనులు చేపట్టే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎంపీ తనూజరాణి

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

కొయ్యూరు, ఆగస్టు 31: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సీడీపీవో విజయకుమారి పిలుపునిచ్చారు. శనివారం కొయ్యూరు ఐసీడీఎస్ పరిధిలోని ప్రతీ అంగన్‌వాడీ సెంటరులో అమ్మపేరు మీద ఒక చెట్టు కార్యక్రమంలో ఢీగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సీడీపీవో పలు కేంద్రాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయం మేరకు హరితాంధ్రప్రదేశ్ సాధనకు తమవంతుగా కృషిచేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బాలమణి, సునీత, కొండమ్మ, మహాలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి కోసం మొక్కలు నాటాలి

గూడెంకొత్తవీధి, ఆగస్టు 31: రేపటి కోసం ప్రతీ తల్లి ఒక్క మొక్క నాటాలని ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మిదేవి పిలుపునిచ్చారు. శనివారం 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లుల పేరిట మొక్కలు నాటారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ భావితరాల కోసం మొక్కలు నాటాలన్నారు. ఈమేరకు ప్రతి తల్లి తన పేరున ఒక మొక్క నాటాలన్నారు. దీంతో గ్రామాల్లో పచ్చదనం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మోహిని, రామలక్ష్మి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

విద్యార్థినులకు మెరుగైన సేవలు అందించాలి

అనంతగిరి, ఆగస్టు 31: డుంబ్రిగుడ మండలంలోని జామిగుడ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలోని కలుషితమైన ఆహారం తిని అనారోగ్యానికి గురికావడంపై ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ.శంకరరావు స్పందించారు. ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్య సేవలను అందించాలని వైద్యులకు ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, ఆశ్రమ పాఠశాలలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశించారు.

అంగన్‌వాడీ కార్యకర్త మృతి

చింతపల్లి, ఆగస్టు 31: కిటుముల పంచాయతీ పకాబు మినీ అంగన్‌వాడీ కార్యకర్తల రాడ దేవుడమ్మ(50) గుండెపోటుతో మరణించింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం శనివారం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి బాలింతలు, గర్భిణులకు రేషన్ పంపిణీ చేసిందన్నారు. శనివారం వేకువజామున ఛాతిపై నొప్పివస్తుందని కుప్పకూలిపోయి క్షణాల వ్యవధిలోనే ఆమె మృతి చెందిందన్నారు. ఆమె మృతిపై సీడీపీవో బీవీ రమణ, ఏసీడీపీవో రామలక్ష్మి సంతాపం వ్యక్తం చేశారు.

డొంకరాయిలో కొనసాగుతున్న నీటి విడుదల

సీలేరు, ఆగస్టు 31: సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి జలాశయానికి వరదనీరు వచ్చి చేరుతుండటంతో శనివారం కూడా నీటి విడుదలను కొనసాగించినట్టు జెన్‌కో ఈఈ విజయ్‌కుమార్ తెలిపారు. అల్పపీడన ప్రభావంతో డొంకరాయి జలాశయం ఎగువ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండడంతో ఎనిమిది వేల క్యూసెక్కుల నుంచి తొమ్మిది వేల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లోస్ వచ్చి చేరడంతో నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జలాశయం 6, 7 గేట్లు ఎత్తి దిగువకు 4400 క్యూసెక్కుల నీటిని, మరో నాలుగు వేల క్యూసెక్కుల నీటిని పవర్ కెనాల్ ద్వారా పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి విడుదల చేసినట్టు చెప్పారు.

రహదారి ఛిద్రం.. ప్రయాణం ప్రమాదకరం

... 3వ పేజీ తరువాయి

ధారాలమ్మ ఘాట్ రోడ్డులో సప్పర్ల రేయిన్‌గేజ్ నుంచి ధారాలమ్మ ఆలయం వరకు మధ్యలో గల 5 కిలోమీటర్లు, సీలేరు నుంచి పాలగెడ్డ వరకు 12 కిలోమీటర్ల అంతర్రాష్ట్ర రహదారి అడుగడుగునా గోతులమయమై ఇటుగా ప్రయాణించాలంటే బెంబేలెత్తిస్తోంది. ధారాలమ్మ ఘాట్ రోడ్డులో గత మూడు రోజులుగా కొండలపై కురిసిన వర్షం రోడ్డుపై ప్రవహించి రోడ్డు ఎక్కడికక్కడ కోతకు గురై కాలువను తలపిస్తోంది. దీంతో కార్లు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సీలేరు, ధారకొండ ప్రాంతాల నుంచి అత్యవసర రోగులను, గర్భిణులను చింతపల్లి, నర్సీపట్నం, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు తరలించడానికి అంబులెన్సు ఇతర వాహనదారులు ఇబ్బంది లు పడుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఆర్ అండ్ బీ అధికారులు, ఐటీడీఏ పీవో స్పందించి ఈ రహదారిని బాగుచేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

మీ పిల్లలకు ఇలాంటి ఆహారమే పెడతారా?

... 3వ పేజీ తరువాయి

వసతి గృహాలను తనిఖీ చేస్తామన్నారు. ఆయన వెంట జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, డీఎంహెచ్‌వో తదితరులు ఉన్నారు.

విచారణకు కమిటీ ఏర్పాటు

ఈ ఘటనపై ఐటీడీఏ డీడీ, ఏటీడబ్ల్యూ, ఎంపీడీవో, తహసీల్దార్‌తో కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, టీడీపీ నేత దొన్నుదొర ఆస్పత్రికి వెళ్లి విద్యార్థినులను పరామర్శించారు.

వదలని వాన

... 3వ పేజీ తరువాయి



చింతపల్లి మండలంలోని చౌడుపల్లిలో వర్షపు నీటితో నిండిపోయిన పంట పొలాలు

కురిసింది. వర్షం వల్ల ప్రధాన రహదారులన్నీ వాగులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు, పంట పొలాల్లో వర్షపు నీరు చేరింది.

పెదబయలులో..

పెదబయలు: భారీ వర్షాలకు వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జనజీవనానికి కొంత సేపు ఆటంకం కలిగింది.

లంబసింగి ఘాట్‌లో విరిగిపడిన బండరాళ్లు

చింతపల్లి: లంబసింగి ఘాట్ రోడ్డులో భారీ బండరాళ్లు విరిగిపడ్డాయి. అయితే వాహనాల రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగలేదు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లంబసింగి ఘాట్ బోడకొండమ్మ ఆలయం దిగువ మలుపు వద్ద భారీ బండరాళ్లు రెండు రహదారిపై పడ్డాయి. సమయానికి వాహనాల రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. బండరాళ్లను పరిశీలించిన తహసీల్దార్ రామకృష్ణ తొలగించాలని అధికారులను ఆదేశించారు.

సంక్షిప్తంగా..

ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను వినియోగించుకోండి: కలెక్టర్

హుకుంపేట, ఆగస్టు 31: ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ కోరారు. మండలంలో తడిపుట్టు పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం గిరిజనులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మండలంలో శతశాతం పింఛన్లు అందించాలని ఎంపీడీవో వెంకటరావుకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన మన్యం నాయకులు



మంత్రి నారా లోకేశ్‌తో టీడీపీ నేత సురేశ్‌కుమార్

పాడేరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను పలువురు మన్యం నాయకులు కలిశారు. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సురేశ్‌కుమార్ శుక్రవారం విశాఖలో లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలను మంత్రికి తెలిపినట్టు ఆయన చెప్పారు.

చింతపల్లి: టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి శుక్రవారం రాత్రి మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌తో కలిసి మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. గిరిజన ప్రాంత సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు వెళ్లినట్టు ఈ సందర్భంగా విలేకరులతో ఆమె తెలిపారు. వారి వెంట టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు ఉన్నారు.



లోకేశ్‌తో మాజీ మంత్రి శ్రావణ్, జ్ఞానేశ్వరి తదితరులు

లోకేశ్ దృష్టికి మండల సమస్యలు

ముంచంగిపుట్టు, ఆగస్టు 31: విశాఖపట్నం వచ్చిన రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ సర్పంచులు, మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలసి మండల సమస్యలను తెలిపారు. సుమారు 41 పాఠశాలలకు భవనాలు లేవని, వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మించాలని, పలు పాఠశాలల భవనాలు మరమ్మతులు జరిగేలా చూడాలని మంత్రిని కోరినట్టు సర్పంచులు వి.లక్ష్మణ్, కె.శివశంకర్, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జులు ఎం.చిన్నబాబు, బి.రామారావు తెలిపారు. త్వరలో పాఠశాలల భవనాల నిర్మాణం జరిగేలా చూస్తామని మంత్రి హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.

జర్రెల రహదారి నిర్మించాలి

గూడెంకొత్తవీధి, ఆగస్టు 31: జర్రెల-చింతపల్లి మార్గంలో పశువులబంద వద్ద అధ్వానంగా తయారైన రహదారి నిర్మించాలని మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లామని టీడీపీ యువ నేత గాబ్రియేలు తెలిపారు. శుక్రవారం విశాఖపట్నం పార్టీ కార్యాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందించినట్టు చెప్పారు. దీనిపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్టు ఆయన తెలిపారు.

నేటి నుంచి స్వచ్ఛ పఖ్వాడా: డీఈవో

పాడేరు రూరల్, ఆగస్టు 31: జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఆదివారం నుంచి స్వచ్ఛ పఖ్వాడా పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని డీఈవో పి.బ్రహ్మాజీరావు ఆదేశించారు. ఆదివారం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయాలని, 2న తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి స్వచ్ఛత ప్రాధాన్యత వివరించాలని, 3న పారిశుధ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలని, 4న విద్యార్థులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా గ్రామాలను సందర్శించి స్వచ్ఛత, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. అలాగే 6న నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి నీటిని పొదుపుగా వాడటం, భూగర్భ జలాలను పరిరక్షించడం వంటి అంశాలపై విద్యార్థులకు వివరించాలన్నారు. 7న పరిశుభ్రతపై పోటీలు నిర్వహించాలని, 8న చేతుల శుభ్రతపై అవగాహన, భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కొనేలా చర్యలు తీసుకోవాలని సూచించాలన్నారు. 12వ తేదీన స్వచ్ఛ పఖ్వాడాపై అవగాహన ప్రదర్శన నిర్వహించాలని, 13, 14వ తేదీల్లో స్వచ్ఛ పఖ్వాడాపై భవిష్యత్‌లో చేపట్టనున్న కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందించాలని, 15వ తేదీన విద్యార్థులకు బహుమతులు అందించాలని ఆయన తెలిపారు.

టీడీపీ ఎస్టీ సెల్ కార్యదర్శిని పరామర్శించిన గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, ఆగస్టు 31: అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గబ్బాడ సింహాచలంను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని, సింహాచలంకు ధైర్యం చెప్పారు. అలాగే ఆర్థిక భరోసా ఇచ్చారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలుపర్తి గోవిందరావు పాల్గొన్నారు.

శ్రీధర్ మరణం పార్టీకి తీరని లోటు

చింతపల్లి: ఐటీడీపీ మండల అధ్యక్షుడు సరమండ శ్రీధర్ మరణం పార్టీకి తీరని లోటని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. వారం రోజుల క్రితం అనారోగ్యంతో శ్రీధర్ మరణించిన విషయం తెలిసిందే. ఆయన భార్య కుమారి, పిల్లలను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువకుడు, సీనియర్ నాయకుడు కావడంతో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడన్నారు. ఆయన భౌతికంగా దూరం కావడం బాధాకరమని వాపోయారు. కుటుంబ సభ్యులకు పార్టీ ఆదుకుంటుందని ఆమె భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పార్వతి, పడాల్, వి.హేంద్ర తదితరుల పాల్గొన్నారు.